# స్వర్గలోకపు చెట్లు

## అంశం : 128

**స్వర్గంలో అన్నిరకాల ఫలవంతమైన చెట్లు ఉంటాయి. కానీ ఖర్జూరం, దానిమ్మ, ద్రాక్ష చెట్లు ఎక్కువగా ఉంటాయి.**

"వాటిలో పండ్లూ ఫలాలూ, ఖర్జూరాలూ, దానిమ్మ కాయలూ పుష్కలంగా ఉంటాయి. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరిస్తారు?" (ఖుర్ఆన్, రహ్మాన్: 68-69)

"నిశ్చయంగా భయభక్తులు కలవారి కొరకు ఒక సాఫల్య స్థానం ఉంది; ఉద్యాన వనాలూ, ద్రాక్షతోటలూ ఉన్నాయి." (ఖుర్ఆన్, నబా: 32-33)

## అంశం : 129

**స్వర్గంలోని చెట్లకు ముళ్ళు ఉండవు.**

## అంశం : 130

**అరటి, రేగు చెట్లు స్వర్గంలో ఉంటాయి.**

## అంశం : 131

**స్వర్గంలో చెట్ల నీడలు ఎంతో పొడవుగా ఉంటాయి.**

"ఇక కుడిపక్షం వారు; కుడిపక్షం వారిని (అదృష్టాన్ని) గురించి ఏమనాలి? వారు ముళ్ళు లేని రేగు చెట్లు, అరటి పండ్ల గెలలు, దూరంగా వ్యాపించి ఉండే నీడలు, ఎల్లప్పుడూ ప్రవహించే నీరు, ఎన్నటికీ అంతం కాని, నిరాటంకంగా లభించే అసంఖ్యాకమైన పండ్లు మరియు ఎత్తైన ఆసనాల మధ్య ఉంటారు." (ఖుర్ఆన్, వాఖిఅహ్: 27-33)

## అంశం : 132

**స్వర్గంలోని చెట్లు ఎంత పచ్చగా కళకళలాడుతూ ఉంటాయంటే, అవి ముదురు పచ్చని రంగులో ఉంటాయి.**

## అంశం : 133

**స్వర్గంలోని చెట్లు ఎల్లప్పుడూ పచ్చగా కళకళలాడుతూ ఉంటాయి.**

"అవి దట్టమైన ముదురు పచ్చని తోటలు. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరిస్తారు?" (ఖుర్‌ఆన్, రహ్మాన్ : 64-65)

## అంశం : 134

**స్వర్గంలోని చెట్ల కొమ్మలు పచ్చగా, పొడవైనవిగా, దట్టమైనవిగా ఉంటాయి.**

"(స్వర్గలోకపు చెట్లు) పచ్చగా, కనుల పండువుగా ఉండే కొమ్మలతో, రెమ్మలతో నిండి ఉంటాయి. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరిస్తారు?'

(ఖుర్‌ఆన్, రహ్మాన్ : 48-49)

## అంశం : 135

**స్వర్గంలోని ఒక చెట్టు నీడ ఎంత పొడవుగా ఉంటుందంటే ఒక గుర్రం అందులో నిరంతరాయంగా వంద సంవత్సరాల పాటు ప్రయాణించినప్పటికీ అది అంతరించదు.**

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "స్వర్గంలోని ఒక చెట్టు నీడ ఎంత పొడవుగా ఉంటుందంటే ఒక గుర్రం అందులో నిరంతరాయంగా వంద సంవత్సరాల పాటు ప్రయాణించినప్పటికీ అది అంతరించదు. ఒకవేళ ఖుర్‌ఆన్ ద్వారా దీనిని అర్థం చేసుకోవాలనుకుంటే (ఖుర్‌ఆన్‌లోని 'వాఖిఅహ్' సూరహ్ 30వ వాక్యం) 'వ జిల్లిమ్ మమ్‌దూద్' (పొడవైన నీడ)ను చదువుకోండి. స్వర్గంలో ఏదయినా వ్యక్తికి చెందిన ఒక విల్లు పట్టే స్థలం (ప్రపంచంలో) సూర్యుడు ఏయే వస్తువులపై ఉదయిస్తాడో లేదా అస్తమిస్తాడో వాటన్నింటికంటే ఉత్తమమైనది." (దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[1]

## అంశం : 136

**స్వర్గంలో అన్ని చెట్ల కాండాలూ బంగారంతో చేయబడి ఉంటాయి.**

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "స్వర్గంలో బంగారంతో చేయబడిన కాండాన్ని కలిగి వుండని చెట్టు ఏదీ ఉండదు." (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[2]

## అంశం : 137

**(స్వర్గంలో) కొన్ని ఖర్జూరపు చెట్ల కాండం పచ్చ రంగులో ఉంటుంది. అలాగే దాని రెమ్మల మూలాలు ఎరుపు కలిసిన బంగారు రంగులో ఉంటాయి.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(ర) ఈ విధంగా పేర్కొన్నారు: "స్వర్గంలో ఖర్జూరపు చెట్టు కాండం పచ్చరంగులో ఉంటుంది. అలాగే దాని రెమ్మ మూలం ఎరుపు కలిసిన

బంగారు రంగులో ఉంటుంది. దాని కొమ్మతో స్వర్గవాసుల వస్త్రాలు తయారుచేయ బడతాయి. వారి వస్త్రాలు, అంగీలు కూడా దానితోనే తయారు చేయబడతాయి. ఖర్జూరపు పండు జాడీ లేదా బాల్చీకు సమానంగా ఉండి పాల కంటే తెల్లగా, తేనె కంటే తియ్యగా, వెన్న కంటే మెత్తగా ఉంటుంది. దానిలో కఠినత్వం ఏమాత్రం ఉండదు.'' (షరహుస్సున్నహ్)[3]

## అంశం : 138

**ఈ క్రింది స్తోత్రాన్ని పఠించడం వల్ల స్వర్గంలో నాలుగు అత్యుత్తమమైన చెట్లు నెలకొల్పబడతాయి.**

హజ్రత్ అబూహురైరహ్(ర) ఈ విధంగా పేర్కొన్నారు: నేను ఒక చెట్టును నాటుతుం డగా అటువైపుగా వెళ్తున్న దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా ప్రశ్నించారు : ''ఓ అబూహురైరహ్! ఎవరికోసం చెట్టు నాటుతున్నావు?'' ''నా కోసమే'' అని నేను సమాధానమిచ్చాను. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా పలికారు : ''ఇంతకంటే మంచి చెట్టు గురించి నీకు తెలుపనా?'' ''ఓ దైవప్రవక్తా (స) తప్పకుండా తెలపండి'' అని నేను పలికాను. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా పలికారు :''సుబ్హానల్లాహ్ (అల్లాహ్ పరమ పవిత్రుడు) వల్హమ్దులిల్లాహ్ (స్తోత్రం కేవలం అల్లాహ్ కొరకే) వ లా ఇలాహ ఇల్లల్లాహు (అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు లేడు) వల్లాహు అక్బర్ (అల్లాహ్ అందరికంటే గొప్పవాడు) అని పలకడం వల్ల ప్రతి పదానికి బదులుగా నీ కొరకు స్వర్గంలో ఒక చెట్టు నాటబడుతుంది.''

(దీనిని ఇబ్నెమాజహ్ ఉల్లేఖించారు, సహీహ్)[4]

## అంశం : 139

**క్రింది వాక్యాన్ని పఠించడం వల్ల స్వర్గంలో ఖర్జూరపు చెట్టు నాటబడుతుంది:**

హజ్రత్ జాబిర్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: '''ఏ వ్యక్తయితే 'సుబ్హానల్లాహిల్ అజీమి వ బిహమ్దిహీ' (మహోన్న తుడైన అల్లాహ్ తన స్తోత్రంతో సహా పరమ పవిత్రుడు'' అని పలుకుతాడో అతడి కొరకు స్వర్గంలో ఒక ఖర్జూరపు చెట్టు నాటబడుతుంది.''

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[5]

## అంశం : 140

**'తూబా' అనేది స్వర్గంలోని ఒక చెట్టు పేరు. దాని నీడ ఎంత పొడవుగా ఉంటుందంటే దానిని అధిగమించడానికి వంద సంవత్సరాలు పడుతుంది.**

## అంశం:141

**తూబా చెట్టు పండ్ల గుత్తుల ద్వారా స్వర్గవాసుల వస్త్రాలు తయారుచేయ బడతాయి.**

హజ్రత్ అబూ సఈద్ ఖుద్రీ(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "తూబా అనేది స్వర్గంలోని ఒక చెట్టు పేరు. దాని నీడ ఎంత పొడవుగా ఉంటుందంటే దానిని అధిగమించేందుకు వంద సంవత్సరాలు పడుతుంది. స్వర్గవస్త్రాలు దాని పండ్లగుత్తుల నుంచే తయారు చేయ బడతాయి."

(దీనిని అహ్మద్ ఉల్లేఖించారు, సహీహ్)[6]

## అంశం : 142

**'జైతూన్' అనేది స్వర్గంలోని ఒక చెట్టు పేరు.**

వివరణ కొరకు అంశం - 410లో పేర్కొనబడిన హదీసును అధ్యయనం చేయండి.

---

అథః సూచికలు :

1. కితాబ్ బదఉల్ ఖలఖ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతిల్ జన్నహ్
2. అబ్వాబ్ సిఫతుల్ జన్నహ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతి అష్జారుల్ జన్నహ్ 2049 / 2)
3. కితాబుల్ ఫితన్, బాబ్ సిఫతుల్ జన్నహ్ వ అహ్లిహా
4. కితాబుల్ అదబ్, బాబ్ ఫజ్లుత్తస్బీహ్ (3069 /2)
5. సహీహ్ జామిఉత్తిర్మిజీ, లిల్ అల్బానీ, అల్ జుజ్ఉస్సాలిస్, హదీస్ నెం:2757
6. సిల్సిలయె అహాదీస్ అస్సహీహహ్ లిల్ అల్బానీ, అల్ జుజ్ఉర్రాబిఅ, హదీస్ నెం:958